# ఆరేండ్ల కల సాకారం




తుది మెరుగులు దిద్దుకుంటున్న శ్రీరామ నాయీబ్రాహ్మణ సేవా సంఘం నూతన భవనం

- **రూ.8లక్షలతో నాయీబ్రాహ్మణ సేవా సంఘ భవనం నిర్మాణం**
- **నాడు నాయీబ్రాహ్మణులకు ఈటల ఉత్తుత్తి హామీ**
- **మాటిచ్చి నెరవేర్చిన అమాత్యులు**

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 19: హుజూరాబాద్ పట్టణానికి చెందిన నాయీబ్రాహ్మణ కులస్తుల ఆరు సంవత్సరాల కల నెరవేరింది. అమాత్యుల చొరవతో సంఘానికి శాశ్వత భవనం సమకూరింది. ఆరు సంవత్సరాల క్రితం ప్రభుత్వ దవాఖాన పక్కన శ్రీరామ నాయీబ్రాహ్మణ సేవా సంఘానికి భవనం ఉండేది. వంద పడకల హాస్పిటల్ నిర్మాణంలో భాగంగా దానిని కూల్చివేయగా, అక్కడికి సమీపంలో మరో భవనాన్ని రూ. ఐదు లక్షలతో నిర్మించి ఇస్తానని అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు ఈటల రాజేందర్ హామీ ఇచ్చారు. కానీ రెండేళ్ల క్రితం జరిగిన ఉప ఎన్నికల వరకు భవన నిర్మాణం గురించి నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు పలుమార్లు కలిసి నూతన భవనం కట్టిస్తామన్న మాట నిలుపుకోవాలని కోరినా ఆయన పట్టించుకోలేదు. భవనం లేకపోవడంతో చెట్ల కింద కుల సంఘం సమావేశాలు ఏర్పాటు చేసుకొని ఇబ్బందులు పడుతున్నామంటూ ఉప ఎన్నికల ప్రచారానికి వచ్చిన అమాత్యులు గంగుల కమలాకర్, తన్నీరు హరీశ్‌రావుకు నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు, సభ్యులు విన్నవించగా, వారు వెంటనే స్పందించి బీసీ సంక్షేమ శాఖ నుంచి రూ.8 లక్షలను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఏడాది తిరగకుండానే నూతన భవన నిర్మాణ పనులను పూర్తి చేయించి హామీని నిలబెట్టుకొన్నారు. ఈటల రాజేందర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోవడం, మంత్రులు గంగుల కమలాకర్, టీ హరీశ్‌రావు మాటిచ్చి నెరవేర్చడంపై సంఘం నాయకుల్లో హర్షం వ్యక్తమవుతున్నది. కాగా, శ్రీ రామ నాయీబ్రాహ్మణ సేవా సంఘం నూతన భవనాన్ని అసెంబ్లీ ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం ప్రారంభించేందుకు అన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు.

**ఆదరించిన ప్రభుత్వానికి అండగా ఉంటం**



ఈటల రాజేందర్ మంత్రిగా ఉన్నప్పుడు ప్రత్యేక నిధులు మంజూరు చేసి సంఘానికి నూతన భవనం నిర్మించి ఇస్తామని మాట ఇచ్చి దోకా చేశాడు. గత ఉప ఎన్నికలో ప్రచారానికి వచ్చిన మంత్రులు గంగుల కమలాకర్, టీ హరీశ్‌రావుకు సమస్య చెప్పగా వెంటనే నిధులు మంజూరు చేశారు. మళ్లీ ఈ జనరల్ ఎన్నికల్లోపే కొత్త భవన నిర్మాణం పూర్తి చేసి, ఓట్లు అడిగేందుకు రావడం చాలా సంతోషంగా ఉంది. అంతే కాకుండా ఎస్సారెస్పీ స్థలంలో 500 గజాల్లో సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అక్టోబర్ 4న ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి భూమిపూజ కూడా చేశారు. మమ్మల్ని ఆదరించిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి నాయీబ్రాహ్మణులం అండదండగా ఉంటాం. మోసపు మాటలు చెప్పే ఈటల వంటి నాయకులను ప్రజలు నమ్మి ఈ ఎన్నికల్లో మోసపోవద్దు.

*- బండారి శ్రీనివాస్, అధ్యక్షుడు, నాయీబ్రాహ్మణ సేవా సంఘం*

# కేసీఆర్‌తోనే ఎరుకలకు ఆత్మగౌరవం



మాట్లాడుతున్న తెలంగాణ ఎరుకల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకిని రాజు

- **50వేల కుటుంబాల అభివృద్ధికి రూ.60 కోట్లు కేటాయించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే**
- **ఎరుకల సంపూర్ణ మద్దతు గులాబీ పార్టీ అభ్యర్థులకే**
- **తెలంగాణ ఎరుకల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకిని రాజు**

హుజూరాబాద్‌టౌన్, నవంబర్19: ఉమ్మడి రాష్ట్రంలో ఎరుకల సంక్షేమాన్ని ఏపార్టీ కూడా పట్టించుకున్న దాఖలా లేదని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్‌తోనే తమ కులస్తులకు నిజమైన న్యాయం జరిగి ఆత్మగౌరవం దక్కిందని తెలంగాణ ఎరుకల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకిని రాజు పేర్కొన్నారు. ఆదివారం సిటీ సెంటర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, స్వరాష్ట్రం కోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన ప్రాణాన్ని సైతం పణంగా పెట్టి పోరాటం చేశారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 33 గిరిజన తెగలు ఉండగా, అందులో ఆదివాసీ ఎరుకల కులస్తులను రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు గుర్తించి హైదరాబాద్ కేంద్రంగా ఎకరం భూమి, రూ.ఐదు కోట్ల నిధులు ఇచ్చి ఎరుకల ఆత్మగౌరవ భవనాన్ని నిర్మించారన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పందుల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్న ఎరుకల జాతి ఉద్ధరణ కోసం, వారి కుటుంబాల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఎరుకల ఎంపవర్‌మెంట్ స్కీమ్ ఏర్పాటు చేసి రూ.60 కోట్లు నిధులు ఇచ్చి ఎరుకల కులస్తులను ఆదుకున్న చరిత్ర సీఎం కేసీఆర్‌దన్నారు. అంతేకాకుండా ఏటా ఎరుకల కులస్తుల ఆరాధ్య దైవం నాంచారమ్మ జాతరను అధికారికంగా జరిపిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు. సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే కుర్ర సత్యనారాయణకు గవర్నర్‌కోటాలో ఎమ్మెల్సీ అవకాశం కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌దన్నారు. అలాగే హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుతాటి రామన్నకు చైర్మన్‌గా అవకాశం ఇవ్వడం ద్వారా ఎరుకలకు రాజ్యాధికారం కల్పించారన్నారు. గతంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఎరుకల కులస్తులకు కనీస ప్రాధాన్యత దక్కలేదన్నారు. కేసీఆర్ సీఎం అయ్యాకనే ఎరుకల కులస్తులకు రాజ్యాధికార ఫలాలు దక్కాయని స్పష్టం చేశారు. ఎరుకల జాతి తరపున సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అందులో భాగంగా తెలంగాణ వ్యాప్తంగా 119 నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న బీఆర్ఎస్ పార్టీకి ఎరుకల కులస్తుల సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు చెప్పారు. తెలంగాణలో మూడో సారి కేసీఆర్‌ను సీఎంగా గెలిపిస్తే ఎరుకల కులస్తులకు 100శాతం న్యాయం జరుగుతుందనే విశ్వాసం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఎరుకల కులస్తులు ఓటేసి గెలిపించి మద్దతు ప్రకటించాలన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని లోకిని రాజు పిలుపునిచ్చారు. సమావేశంలో తెలంగాణ ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనేటి రాజు, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి కుతాడి తిరుపతి, జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి మొండయ్య, కుతాటి తిరుపతి, అంగడి రమేశ్, రేవెల్లి తిరుపతి, కుతాటి రమేశ్, లోకిని రాజయ్య, దుగ్యాల పరమేశ్, పల్లెకొండ సుధాకర్, లోకిని తిరుపతి, లోకిని శ్రీనివాస్, రేవెల్లి కొమురయ్య, రేవెల్లి రవి, మొండ్రాయి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు బీఆర్ఎస్ ప్రచారం

సైదాపూర్, నవంబర్19: మండలంలోని ఏడు గ్రామాల్లో సోమవారం బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని పార్టీ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య, ప్రధాన కార్యదర్శి చెల్మల్ల రాజేశ్వర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎలబోతారం, రాములపల్లి, రాంచంద్రాపూర్, కుర్మపల్లి, జాగీర్‌పల్లి, వెన్కెపల్లి, సైదాపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం ఉంటుందని, దీనికి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.



కనపర్తిలో దళితులతో మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్

# సీఎం కేసీఆర్ వెంటే దళితులు

- **ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్**
- **కనపర్తిలో స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం**

వీణవంక, నవంబర్ 19: దళితుల అభివృద్ధికి పాటుపడుతున్న సీఎం కేసీఆర్ వెంటే దళితజాతి యావత్తు ఉన్నదని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కనపర్తి గ్రామంలో ఆదివారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డికి మద్దతుగా స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దళితులకు అందించిన పథకాలను వారికి వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి పాడి కౌశిక్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ మాజీ చైర్మన్ పొడేటి రామస్వామి, దళితబంధు మండల కన్వీనర్లు తాండ్ర శంకర్, మొలుగూరి ప్రభాకర్, నాయకులు పులి ప్రకాశ్, జూపాక మాజీ సర్పంచ్ ఇల్లందుల శ్రీనివాస్, చంద్రమౌళి, మంద రాజేశ్, రేణుకుంట్ల తారక్ తదితరులు పాల్గొన్నారు.

# 'కౌశికన్ననే గెలిపించుకుందాం'

జమ్మికుంట, నవంబర్19: పనిచేసే ప్రభుత్వానికే ఓటేద్దామని, హౌసింగ్‌బోర్డుకాలనీ సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన పాడి కౌశికన్ననే భారీ మెజార్టీతో గెలిపించుకుందామని 6వ వార్డు కౌన్సిలర్ శ్రీపతి నరేశ్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వానలు పడ్డప్పుడు హౌసింగ్‌బోర్డుకాలనీ మునుగుతున్నదని, కాలనీ వరద కాలువకు శాశ్వత పరిష్కారం చేయిస్తానని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. పార్టీలకతీతంగా బీఆర్ఎస్‌కు ఓటేసి గెలిపించుకుందామని విజ్ఞప్తి చేశారు. అందరం కలిసి అభివృద్ధి చేసుకుందామన్నారు. ఎన్నికల సమయంలో వచ్చి, పోయేవాళ్లు మనకొద్దని, మన మధ్యలో ఉండే నాయకుడు కౌశిక్‌రెడ్డి ఒక్కరేనని స్పష్టం చేశారు. కౌశిక్‌రెడ్డికి ఒక్కసారి అవకాశం ఇద్దామని, వార్డును అన్ని విధాలా అభివృద్ధి చేసుకుందామని పేర్కొన్నారు.

# వధూవరులను ఆశీర్వదించిన నాయకులు



హుజూరాబాద్‌టౌన్: వధూవరులతో రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్

హుజూరాబాద్‌టౌన్, నవంబర్19: పట్టణ శివారులోని ఎస్సార్ కన్వెన్షన్ హాల్‌లో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, దివంగత కర్రీ సత్యం కూతురు కర్రీ యామిని–నాగభూషణం వివాహానికి ఆదివారం రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ హాజరయ్యారు. వధూవరులకు శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. వారి వెంట బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, కౌన్సిలర్ తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు బత్తుల సమ్మయ్య, భాస్కర్‌చారి, రమేశ్‌యాదవ్ తదితరులున్నారు.

**వివాహ వేడుకలకు హాజరైన 'గెల్లు'**

జమ్మికుంట, నవంబర్ 19: మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన ఆళ్ల రాజశేఖర్–అనూష వివాహానికి రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వధూవరులను ఆశీర్వదించారు. గెల్లు వెంట నాయకులు వాసుదేవరెడ్డి, ఆలేటి శ్రీరాం, స్థానికులున్నారు.

# అక్రమంగా మద్యం అమ్మితే చర్యలు

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 19: ఎవరైనా అక్రమంగా మద్యం, గుడుంబా అమ్మినా, కలిగి ఉన్నా కఠిన చర్యలు తప్పవని హుజూరాబాద్ ఎక్సైజ్ సీఐ జీ దుర్గాభవాని హెచ్చరించారు. ఆదివారం హుజూరాబాద్ పట్టణ శివారులోని సిర్సపల్లి క్రాస్‌రోడ్ వద్ద సమ్మయ్య అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై అక్రమంగా మద్యం తరలిస్తుండగా పట్టుకున్నామని చెప్పారు. అతడి నుంచి 45 బాటిళ్ల మద్యం సీసాలు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీలో ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ ముకుందరెడ్డి, ఎక్సైజ్ కానిస్టేబుల్స్ సంతోష్, కార్తీకకుమార్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.